క్లుప్తంగా

రూ.2.03 లక్షల విలువైన పూజాసామగ్రి వితరణ



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడులోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి సాయిబాబాను దర్శించుకున్నారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన వ్యాపారి ముప్పా శ్రీనివాసరావు, సత్యవతి దంపతులు రూ.2.03 లక్షల విలువ చేసే రెండు కిలోల వెండి పూజా సామగ్రిని ఆలయానికి విరాళంగా అందించారు. ఆలయ చైర్మన్ కొల్లి వెంకట్రావు దాతలను సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం మూడు వేల మంది భక్తులు అన్నప్రసాద వితరణ చేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ఉయ్యూరు: లక్ష్యాన్ని నిర్దేశించుకుని, కృషి, పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అయ్యప్పస్వామి ఆలయ ట్రస్టీ కంచర్ల గంగాధర్‌రావు అన్నారు. మండలంలోని గండిగుంట గ్రామంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఇంజినీరింగ్ చదువుతున్న మెరిట్‌విద్యార్థి గాయత్రీదుర్గకు ఆదివారం ఆయన రూ.10 వేలు నగదు ప్రోత్సాహం అందించారు. కార్యక్రమంలో మండవ జయదేవ్, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి



గన్నవరం రూరల్: మండలంలోని జక్కులనెక్కలం రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గూడవల్లి జాతీయ రహదారి నుంచి జక్కులనెక్కలం గ్రామం కిలో మీటరున్నర దూరంలో ఈ జెడ్పీ రోడ్డు ఉంది. గ్రామంలో 1200 మంది జనాభా నివసిస్తున్నారు. ఈ గ్రామం చుట్టూ 800 ఎకరాలు మాగాణి ఆయకట్టు ఉంది. ఈ గ్రామం నుంచి నిరంతరం స్థానికులు ఉద్యోగాలు, ఉపాధి కోసం విజయవాడకు, ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. రైతులు పొలం పనుల కోసం నిత్యం ఈ రహదారిపై ప్రయాణం చేయాల్సి ఉంది. విజయవాడ నగరానికి సమీపంలో, జాతీయ రహదారికి దగ్గరగా ఉన్న గ్రామానికి సరైన రోడ్డు లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కాలంలో ఆ గ్రామానికి చెందిన పలువురు స్పందన కార్యక్రమంలో వినతి పత్రాలు అందజేశారు. అధికారులు గోతులతో, గుంతలతో నిండి ఉన్న రహదారిని పరిశీలించి వెంటనే రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతు పనుల నిర్వహణ



కంకిపాడు: గోతులమయంగా మారిన కంకిపాడు-గన్నవరం రోడ్డుకు కంకిపాడు పంచాయతీ యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టింది. పునాదిపాడు అండర్ పాస్ వద్ద కంకిపాడు-గన్నవరం ఆర్అండ్‌బీ రోడ్డు గోతుల మయంగా, అధ్వానంగా తయారైంది. చిన్న వర్షం కురిసినా నీరు నిలిచిపోయి రాకపోకలకు అసౌకర్యం కలుగుతోంది. గోతుల్లో వాహనదారులు పడి గాయాలపాలవుతున్నారు. సమస్యపై పలుమార్లు పత్రికల్లో కథనాలు రావటంతో స్పందించిన కంకిపాడు పంచాయతీ అధికారులు రోడ్డు మరమ్మతులను చేపట్టారు. ఆదివారం పంచాయతీ అధికారులు, పాలకవర్గ ప్రతినిధులు గోతులను పూడ్పించారు. పనులను ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, ఈఓ రామకృష్ణ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ మద్దాలి రామచంద్రరావు పరిశీలించారు.

ఇంటింటికీ ఫీవర్ సర్వే

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక తారక రామ కాలనీ, రామాలయం ఏరియా, ఎస్సీ కాలనీల్లో ఆదివారం ఇంటింటికీ ఫీవర్ సర్వే నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూషా నేతృత్వంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు, హెల్త్ సూపర్‌వైజర్లు మూడు ప్రత్యేక బృందాలుగా ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి డెంగీ, డయేరియా, మలేరియా, రాపిడ్ టెస్ట్‌లను నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలని డాక్టర్ మంజూషా సూచించారు. దోమల ద్వారా నివారణకు, పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, మలేరియా సబ్ డివిజనల్ ఆఫీసర్ ఆర్.వెంకటరాజు, హెల్త్ సూపర్‌వైజర్ అప్పారావు, హెల్త్ అసిస్టెంట్ జి.నాగరాజు, పలువురు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

పెనమలూరు: సనాతన భారతీయ విజ్ఞాన సాధనానికి తొలిగురువైన వ్యాస భగవానుని జయంతి జాతికి మహాపర్వదినమని రచయిత, మహిళా అభ్యుదయవాది కోనేరు కల్పన అన్నారు. కానూరు షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం కృష్ణా జిల్లా శాఖ సంస్కార భారతి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా కోనేరు కల్పన గురు సత్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆషాఢ పౌర్ణమి పర్వాన్ని లలిత కళలకు ఆద్యుడైన నటరాజస్వామి పూజా దినంగా నిర్వహిస్తారన్నారు. భారతీయ విద్యలకు ప్రాణమైన గురుశిష్యుల పరంపరకు ఈ దినం స్ఫూర్తి పదమన్నారు. భారతీయ కళా సంస్కారానికి తొలి మెట్టుగా భావించి సంస్కార భారతి నటరాజ పూజా దినోత్సవం ప్రతి ఏటా జరుగుతుందని సంస్కార భారతి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డమ్మ, అప్పారావు, శైలజ, సత్య, కృష్ణవేణి పలువురు పాల్గొన్నారు.

- పోరంకి శ్రీనివాసానగర్ షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపూజా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం బాబాకు అభిషేకం చేశారు. ప్రత్యేకంగా అలంకరించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బాబాను దర్శించుకున్నారు. అనంతరం దాదాపు 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. బాబా మందిరంలో ప్రతి ఏడాది గురుపౌర్ణమి అత్యంత వైభవంగా చేస్తున్నామని కమిటీ అధ్యక్షుడు మున్నంగి అర్జున్‌రెడ్డి తెలిపారు.
- పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవిజయరాజరాజేశ్వరి, శ్రీ విజయసుందరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి ఘనంగా చేశారు. ఆలయంలో శ్రీవాసుదేవానందగిరిస్వామీజీకి భక్తులు గురుపూజ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

నున్న(విజయవాడరూరల్): వ్యాసమహర్షి జయంతిని పురస్కరించుకొని నున్న గ్రామంలోని చినకంచిలో ఆదివారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వ్యాసమహర్షి వేదాలను విభజన చేసి బ్రహ్మసూత్రాలను రాసి, అష్టదశ పురాణాలను రాసి ధర్మసంస్థాపన చేశారు. అందుకే వ్యాసమహర్షి పుట్టినరోజు అనగా ఆషాఢ పౌర్ణమి నాడు గురుపూజోత్సవాన్ని జరుపుకుంటారని చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి దేవస్థానం చినకంచి ట్రస్టీ మొక్కపాటి శర్మ తెలియజేశారు. చినకంచిలో ఆర్ష విద్యాలయం విద్యార్థులు వేదపాఠశాల గురువు పాదాలకు పూజ చేసి గురుపూజోత్సవాన్ని జరుపుకున్నారు. సి.ఉమామహేశ్వరావు, శ్రీవల్లి దంపతులచే శ్రీచక్రనవ ఆభరణ అర్చన చేశారు. గురుపూజ రోజున యతీశ్వరులు చాతుర్మాస దీక్షలు నిర్వహిస్తారు.

షిర్డీ సాయి బాబా మందిరంలో..

నున్న గ్రామంలో శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో మూడు రోజులుగా జరుగుతున్న గురుపౌర్ణమి వేడుకల చివరి రోజు అత్యంత వైభవంగా నిర్వహించారు. బాబా వారికి భక్తులు పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించి, పాలాభిషేకం చేశారు.అష్టోత్తర పూజ, సామూహిక సాయి సత్య వ్రతాలను, అనంతరం అన్నసమారాధన జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పి.నైనవరం గ్రామంలో శ్రీషిర్డీసాయి బాబా మందిరంలో దేవస్థానం ధర్మకర్త లాల్‌బాషా ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం బాబావారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి బాబా ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కంకిపాడు: గురుపౌర్ణమి పర్వదినాన్ని భక్తులు వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం గురుపౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని కంకిపాడు, చలివేంద్రపాలెం, ప్రొద్దుటూరు గాయత్రీవిహార్, ఉప్పలూరు గ్రామాల్లో సాయినాధుని మందిరాల్లో ఉదయం నుంచి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రొద్దుటూరు గాయత్రీవిహార్‌లోని ధ్యానయోగ సాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. బాబా విగ్రహానికి అభిషేకాలు చేయించి, ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రత్యేక పూజలకు హాజరై సాయినాధుడిని దర్శించుకుని పూజలు చేయించారు. పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. నోరి నారాయణమూర్తి షిర్డీసాయి బాబా వైభవం ప్రవచనం చేశారు. పూజా కార్యక్రమాలను గాయత్రీ విహార్ అసోసియేషన్ అధ్యక్షురాలు టీ పుష్పవతి పర్యవేక్షించారు.

ఉయ్యూరు: గురుపౌర్ణమి పర్వదినాన్ని అంతటా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం వేకువ జామునుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆయా ఆలయాల్లో వివిధ రూపాల్లో కొలువుదీరిన స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపించారు. సాయిబాబా ఆలయాల్లో సాయినామసంకీర్తనతో నిర్వహించారు. ఉయ్యూరులో గురుపౌర్ణమిని పురస్కరించుకుని సాయినాధుడిని స్మరిస్తూ ర్యాలీ నిర్వహించారు. తోట్లవల్లూరురోడ్డులోని సాయిబాబా ఆలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణశాఖమంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ బాబాను దర్శించుకుని అన్నసంతర్పణ ప్రారంభించారు. శివాలయం రోడ్డు, కేసీపీ సాయిబాబా ఆలయం, గండిగుంట సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు.



ఉయ్యూరులో అన్నదానం చేస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు



ప్రొద్దుటూరు గాయత్రివిహార్ ధ్యానమందిర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



చినకంచిలో గురువుల పాదాలకు పూజ చేస్తున్న వేదపాఠశాల విద్యార్థులు



మహిళా అభ్యుదయవాది కోనేరు కల్పనను సత్కరిస్తున్న దృశ్యం



బాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ



దుర్గాపురంలో అమ్మవారికి ఆషాఢ సారె తీసుకువస్తున్న భక్తులు



గోసాలలో అమ్మవారికి ఆషాఢ సారె అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసాద్ దంపతులు



అంకమ్మ పేరంటాలమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పిస్తున్న మహిళా భక్తులు

గన్నవరం: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో పలు ఆలయాల్లో అమ్మవార్లకు ఆదివారం భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. గన్నవరం మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత మేళతాళాలు, కోలాట ప్రదర్శనతో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. అనంతరం శ్రీకనకదుర్గమ్మకు భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారెను, వివిధ రకాల నైవేద్యాలను సమర్పించారు. ఆలయ అర్చకులు ఐలూరు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో శ్రీలలితా, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం జరిపారు. బ్రాహ్మణ పరిషత్ గన్నవరం శాఖ అధ్యక్షుడు పన్యారం విష్ణుమూర్తి, సభ్యులు కప్పగంతు లక్ష్మణశాస్త్రి, గోపరాజు సత్యపవన్‌కుమార్, మామిళ్లపల్లి నాగసుబ్బారావు, తిమ్మరాజు వెంకటసుబ్బారావు, యామర్తి వకుళ, సరస్వతుల ఆదిత్య, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఆదివారం శాకంబరీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం గురుపౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుక జరిపారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవమూర్తులను, ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. శాకంబరీదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని మాను (మహాలక్ష్మీ)కి పూజలు చేసి గ్రామపొంగళ్లను నివేదించారు. శ్రీఅంకమ్మ తల్లికి ఆషాఢ బోనాలను భక్తులు సమర్పించారు. తొలుత సువాసినీ స్త్రీలచే శ్రీలలిత సహస్రనామ పారాయణం, శ్రీలక్ష్మీ అష్టోత్తరం జరిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, పలువురు పుర ప్రముఖులు, పరిసరా ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

పెనమలూరు: గోసాల వైకుంఠపురంలో ఉన్న శ్రీకనకదుర్గ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఎమ్మెల్యే బోడెప్రసాద్ దంపతులు ఆషాఢ సారె సమర్పించారు.



శాకంబరీదేవి అలంకరణలో లక్ష్మీతిరుపతమ్మ



పార్వతీదేవి అమ్మవారికి సమర్పించేందుకు ఆషాఢ సారెతో వచ్చిన భక్తులు



రాజ్యలక్ష్మి అమ్మవారికి ఆషాఢ సారె సమర్పిస్తున్న లలితా మహిళా సమాజం

ఆలయ అర్చకుడు దేవరకొండ బుచ్చివెంకటరామసిద్ధాంతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మహిళాభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మకు ఆదివారం ఆషాఢమాసం పౌర్ణమి సందర్భంగా మహిళలు సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, పండ్లతో పాటు భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పించారు. తొలుత అమ్మవారికి సామూహిక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి చినదేవస్థానం చినకంచిలో ఆదివారం కామాక్షి అమ్మవారికి శాకంబరీగా దేవిగా అలంకారం చేసి భక్తులు పూజలు నిర్వహించారు. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా కామాక్షి అమ్మవారికి 20 రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజలు చేశారు. బాలపూజ, సువాసినీ పూజలు నిర్వహించారు. సువాసినీలు కుంకుమపూజలు చేశారు. కల్యాణి బృందం వారి కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భోజనాల కార్యక్రమం జరిగింది.

ఉయ్యూరు: పట్టణంలోని వీరమ్మతల్లికి రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. మెట్టినింట కొలువుదీరిన వీరమ్మతల్లికి ఆషాఢ సారె సమర్పించి పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కూటమి శ్రేణులను గజమాలలో ఘనస్వాగతం పలికారు. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి శ్రీ లలితా మహిళా సమాజం ఆధ్వర్యంలో మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. పసుపు, కుంకుమలు, చీర, సారెతో ఊరేగింపుగా తరలివచ్చి లలితా సహస్రనామ పారాయణం చేశారు.

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి భక్తులు ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. గ్రామంలో సంజీవయ్యనగర్‌కు చెందిన శ్రీ సీతారామాలయం భక్తులు గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగింపుగా ఆషాఢ సారెతో కొండపై వేంచేసి ఉన్న శ్రీ పార్వతీదేవిని దర్శించుకున్నారు. అనంతరం ఆషాఢ సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి సాగర్ పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ఎం.గంగాధరరావు, భక్తులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం శాకంబరి ఉత్సవాలు కన్నులపండువగా నిర్వహించారు. అమ్మవారి గర్భాలయం, ఆలయ ప్రాంగణం మొత్తం రకరకాల కూరగాయాలు, పండ్లతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఆలయ అర్చకులు కందుర్తి మురళీశర్మ ఆధ్వర్యంలో మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య శాకంబరి అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆలయ చైర్మన్ వంగపండు ప్రకాష్ దంపతులు పట్టువస్త్రాలు, పూలు, పసుపు, కుంకుమ, పండివంటలతో అమ్మవారికి సారె సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు శాకంబరి రూపంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



వీరవల్లిలో శాకంబరి అలంకరణలో ఉన్న అమ్మవారికి పూజలు

సాయం చేయడంలోనే నిజమైన ఆనందం



మాట్లాడుతున్న లయన్స్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తోటి వారికి సహాయం చేయడంలోనే నిజమైన ఆనందం ఉంటుందని లయన్స్ క్లబ్ (316డీ) జిల్లా గవర్నర్‌గా ఎన్నికైన గద్దె శేషగిరిరావు అన్నారు. లయన్స్ జిల్లా క్యాబినెట్ ఇన్‌స్టలేషన్ ఆదివారం సాయంత్రం పోరంకిలోని ఓ రిసార్ట్‌లో జరిగింది. ఈ సందర్భంగా గద్దె శేషగిరిరావు మాట్లాడుతూ లయన్స్ అంటేనే సేవ, సహాయానికి మారుపేరు అని అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఎక్కువ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. క్లబ్ వైస్ గవర్నర్ వీవీపీఎస్.ఆంజనేయులు, క్లబ్ పాస్ట్ గవర్నర్స్ మిరియాల వెంకటేశ్వరరావు, శంకర గుప్తా, లయన్స్ క్లబ్ ప్రతినిధులు యర్రంశెట్టి శివరామకృష్ణ, సుంకర కృష్ణ జిల్లాలోని లయన్స్ క్లబ్ సభ్యులు హాజరై జిల్లా గవర్నర్ శేషగిరిరావును అభినందించారు.

వికసించిన బ్రహ్మ కమలం



పెనమలూరు: పోరంకి గ్రామంలో అరుదైన పుష్పం బ్రహ్మకమలం వికసించింది. గ్రామంలో సీతాపురంకాలనీలో ఉంటున్న డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంట్లో ఆదివారం అరుదైన బ్రహ్మపుష్పాలు కనువిందు చేశాయి. వివరాల్లోకి వెళితే.. స్థానిక డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఐదు సంవత్సరాల క్రితం బ్రహ్మకమలం మొక్కను తన ఇంటి పెరట్లో నాటారు. అయితే చాలా కాలం తరువాత రెండు బ్రహ్మకమలం పుష్పాలు వికసించాయి. ఈ పూలను కాలనీ వాసులు వచ్చి ఆసక్తిగా తిలకించారు. డాక్టర్ రవీంద్రనాథ్‌ఠాగూర్ మాట్లాడుతూ బ్రహ్మకమలం హిమాలయ పర్వత ప్రాంతాల్లో, ఉత్తర బర్మా, టిబెట్, నేపాల్, దక్షిణ చైనా దేశాలలో కనబడుతుందన్నారు. బ్రహ్మకమలం ఉత్తరాఖండ్ రాష్ట్ర పుష్పమన్నారు. హిందూ పురాణాల ప్రకారం బ్రహ్మకమలం పై బ్రహ్మదేవుడు కూర్చుని ఉంటాడు. ఆయుర్వేదంలో ఈ మొక్కలు కాళ్లు, చేతివేళ్ల పక్షవాతానికి గురైన సమయంలో, మెదడు సంబంధిత వ్యాధులకు వాడతారన్నారు. బ్రహ్మకమలం విత్తనాల నుంచి నూనెను తీసి తలకు రాసుకుంటే తలనొప్పి, మానసిక సమస్యలు తగ్గుతాయని వివరించారు.

మహిళపై దాడి

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఇందిరానగర్‌లో మహిళపై దాడి చేసిన వ్యక్తిపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన అల్లం లక్ష్మి(55)పై వడ్డి సుధీర్ అనే వ్యక్తి దాడి చేసి గాయపర్చటంతో ఆమె ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. హనుమాన్‌జంక్షన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి మనవడు చరణ్ తన మేనల్లుడు అభితో స్నేహం చేస్తూ చెడు అలవాట్లు నేర్పిస్తున్నాడని సుధీర్ ఫోన్ చేసి ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశాడని, అంతేకాక కొద్దిసేపటికే మద్యం తాగి ఇంటికి వచ్చి తనపై దాడి చేసి గాయపర్చాడని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై ఎస్ఐ ఏడీఎల్ జనార్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం ఆర్టీసీ డిపో నుంచి నడుపుతున్న సర్వీస్‌లకు సంబంధించి విలువైన సూచనలు, సలహాలు, సమస్యలను 87909 96090 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని డిపో పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.